సాక్షి
చిత్తూరు
బుధవారం । 7 । మే । 2025



ఆరోగ్యానికి పుండు

పండ్లు మాటున విషం పొంచి ఉంది. కాయలను రసాయనాలతో మాగబెట్టడడంతో వాటిని తింటే అనారోగ్యం పాలవుతున్నారు. - 8లో



జాతర మొదలైందహో!

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం చాటింపుతో ప్రారంభమైంది. భక్తుల్లో నందడి నెలకొంది. - 8లో



'అద్దె'ల మద్దెల

జిల్లాలో అద్దెల మద్దెల మోగుతోంది. కూటమి సర్కారు విధానాలతో ఇళ్ల యజమానులు అద్దెలను రెట్టింపు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

గర్భిణుల సేవలపై నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గర్భిణులకు అందించే వైద్యసేవల్లో నిర్లక్ష్యం ఉండకూడదని డీఎం అండ్‌హెచ్‌ఓ సుధారాణి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాలను కట్టడి చేసేందుకు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పనిచేయాలన్నారు. గర్భిణుల సేవల్లో నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో గుర్తించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సుఖ ప్రసవాలు పీహెచ్‌సీల్లో జరగాలన్నారు. హైరిస్క్ కేసులను జిల్లా ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రులకు రెఫర్ చేయాలని సూచించారు. ఈ సమీక్షలో వైద్యులు ప్రవీణ, అనూష, అనిల్‌కుమార్, గిరి, వేణుగోపాల్, శ్రీవాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి


చిత్తూరు రూరల్ (కాణిపాకం): కొత్త రేషన్‌కార్డులకు బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. కొత్తకార్డుల దరఖాస్తుతో పాటు కార్డుల విభజన, సభ్యులు చేరిక, చిరునామా మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. సచివాలయాల ద్వారా దరఖాస్తులను సమర్పించుకోవచ్చన్నారు. వెబ్‌సైట్‌లో కూడా కార్డులు దరఖాస్తు, జారీకి బుధవారం నుంచి అవకాశం కల్పించవచ్చన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. కాగా ఇప్పటి వరకు కొత్త రేషన్‌కార్డుల కోసం సుమారు 20 వేల వరకు దరఖాస్తులు వచ్చి ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఇదివరకు ఈకేవైసీ చేయించుకున్న వాళ్లు కార్డు విభజన చేసుకోవాలంటే ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కార్డులు మంజూరు, నిబంధనలు, ఇతరాత్ర విషయాలపై అధికారులకు కూడా పూర్తి స్థాయిలో సమాచారం లేదు. ఆన్‌లైన్‌లో పొందుపరిచే నిబంధనల ప్రకారమే కార్డులు జారీ ఉండవచ్చని వారు భావిస్తున్నారు. కుటుంబ సర్వేను ప్రామాణికంగా తీసుకోనుందని అంటున్నారు.

పెద్దపంజాణి 'గీత' మద్యం షాపునకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్: కల్లు గీత సామాజిక వర్గాలకు సంబంధించి రిజర్వు చేసిన పెద్దపంజాణిలో మద్యం దుకాణం ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిత్తూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ (ఈఎస్) శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. గౌండ్ల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు మద్యం దుకాణం లైసెన్స్ కోసం మంగళవారం నుంచి ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 50 శాతం రాయితీతో కల్లు గీత సామాజికవర్గానికి మద్యం దుకాణం కేటాయిస్తామని, ఇందు కోసం ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే ఈనెల 17వ తేదీ ఉదయం 8 గంటలకు చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో దుకాణాన్ని కేటాయిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు చిత్తూరు నగరంలోని మిట్టూరులో ఉన్న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఈఎస్ కార్యాలయం, పుంగనూరులోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

విత్తన విలాపమేనా?

ఖరీఫ్ విత్తు సమయం ఆసన్నమైంది.. హలం పట్టి పొలం దున్ని సాగుకు సన్నద్ధమయ్యాడు పుడమి పుత్రుడు. రాయితీ విత్తు కోసం ఎదురు చూస్తున్నాడు. కూటమి సర్కారు రాయితీ విత్తనం అరకొరగా కేటాయించింది. ఆ విత్తుపై కూటమి నేతలు పెత్తనం చెలాయిస్తున్నారు. అర్హుడైన కర్షకుడికి కాయలు అందేనా?.. విత్తనం కోసం అన్నదాత విలపించాల్సిందేనా?.. సాగు సాగేనా అన్న అనుమానాలు నెలకొన్నాయి.



జిల్లా సమాచారం

రైతు భరోసా కేంద్రాల సంఖ్య	502
ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం	71,305 హెక్టార్లు
వేరుశనగ సాధారణ విస్తీర్ణం	35,238 హెక్టార్లు
మొత్తం రైతుల సంఖ్య	1.80 లక్షలు
వేరుశనగ సాగు చేసే రైతులు	90 వేలు (సుమారు)
జిల్లాకు అవసరమైన వేరుశనగ విత్తనం	40,338 క్వింటాళ్లు
కోతపెట్టిన విత్తనం	13,988 క్వింటాళ్లు
ప్రస్తుత విత్తన కేటాయింపు	26,350
వేరుశనగ కే–6రకం కేజీ మార్కెట్ ధర	రూ.93
నారాయణి కేజీ ధర	రూ.95

జిల్లాకు అరకొరగా వేరుశనగ విత్తన కేటాయింపు

- ఆ విత్తనానికీ కూటమి నేతల పోటీ
- ముందస్తుగా ఆర్డర్లు
- నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- అర్హులైన రైతులకు కాయలు కష్టమే
- వేరుశనగ సాగు కష్టమే

కాణిపాకం: జిల్లాకు ప్రభుత్వం వేరుశనగ విత్తనాలను అరకొరగా కేటాయించింది. ఈ విత్తనాల పంపిణీపై వ్యవసాయశాఖ సందిగ్ధంలో పడింది. దీనికి తోడు కూటమి నేతలు విత్తన కాయల కోసం పోటీ పడుతున్నారు. ముందస్తుగా విత్తన కాయల కోసం ఆర్డర్లు పెడుతున్నారు. కొన్ని చోట్ల అధికారులు సైతం వారి సిఫార్సులకు తలొగ్గారు. జిల్లాలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా సాగు చేసే పంటల్లో ప్రధానమైన పంట వేరుశనగ. జిల్లా వ్యాప్తంగా 1.80 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో 90 వేల మంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేస్తారు.

విత్తనకాయల కోత

జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్‌లో 71,305 హెక్టార్లల్లో 22 రకాల పంటలు సాగులోకి రావచ్చని అంచనా వేశారు. ఇందులో 35,238 హెక్టార్లలో వేరుశనగ సాగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రకటించారు. ఈ మేరకు తొలుత 40,338 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం 26,350 క్వింటాళ్ల కాయలను మాత్రమే కేటాయించింది. కేటాయించిన విత్తనకాయలు సరిపోవని, 13,988 క్వింటాళ్ల విత్తనాలు ఇవ్వాలని మళ్లీ ప్రతిపాదనలు పంపారు. ఇవి వస్తాయా? లేదా అనే అనుమానం ఉంది. ఇప్పటికే కేటాయించిన కాయలను పంపిణీ చేస్తే ఒక్కొక్క రైతుకు ఒక బ్యాగు చొప్పున్న 88 వేల మందికి ఇవ్వవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. వేరుశనగ రాయితీ ధరను ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించలేదు.

తలొగ్గిన అధికారులు

కూటమినేతలు, కార్యకర్తల సిఫార్సులకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది చాలా మంది తలొగ్గారు. నేతల డిమాండ్ మేరకు కాయలను నేరుగా ప్రైవేటు భవనాలకు మళ్లించేందుకు కుట్రలు పన్నుతున్నారు. కానీ పక్షంలో కాయల కోసం వచ్చే రైతుల పేరిట రెండు, మూడు బ్యాగులకు టోకన్లు వేసి నేతలకు కట్టబెట్టాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. జీడీ నెల్లూరు, చిత్తూరు, ఎస్ఆర్ పురం, పలమనేరు, కుప్పం, వి.కోట, శాంతిపురం, బంగారుపాళెం, పూతలపట్టు, నగరి, గుడిపాల తదితర మండలాల్లో చేయడానికి ప్రయత్నాలు అధికంగా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.


వేరుశనగ పంట (ఫైల్)

కూటమి నేతల వల

అప్పుడే క్షేత్రస్థాయిలో వేరుశనగ విత్తనాల కోసం కూటమి నేతల వద్దకు ఆర్డర్లు పుంజుకుంటున్నాయి. అధిక మొత్తంలో కొల్లగొట్టడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. మండల నేతలు ఒక్కొక్కరూ 50 నుంచి 100 బ్యాగులు ఆశిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పంచాయతీ స్థాయిలోని నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరు 10 నుంచి 50 బ్యాగులు కావాలని హుక్కుం జారీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాము పట్టించుకోకపోతే ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకుల పేర్లు చెప్పి బెదిరింపు ధోరణికి దిగుతున్నారని పలువురు అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

అవసరం మేరకు కాయలు ఇవ్వాలి



వేరుశనగ సాగు చేసే రైతులకు అవసరమైన మేరకు కాయలు ఇవ్వాలి. సిఫార్సులు లేకుండా అర్హులైన రైతులకు కాయలు అందేలా చూడాలి. 26,350 క్వింటాళ్ల కాయలు వస్తే జిల్లాకు సరిపోవు. కచ్చితంగా 40 వేల క్వింటాళ్ల కాయలు అవసరం ఉంది. అధికారులు ఈ విషయాన్ని గమనించాలి. అధికారులు రైతులను ఇబ్బంది పెట్టవద్దు. ముందుస్తుగానే కాయలు పూర్తి స్థాయిలో తెప్పించుకుని ఇచ్చేలా చూడాలి.

–ఆర్ వెంకటరెడ్డి,
రైతు నాయకుడు, జీడీ నెల్లూరు

గంగజాతర చాటింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో మంగళవారం రాత్రి నడివీధి గంగజాతరకు చాటింపు వేశారు. పొలిమేరలోని ఎల్లమ్మదేవతకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. గెరికను ప్రత్యేకంగా అలంకరించి వంశపారంపర్య ధర్మకర్తల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గెరిగను పురవీధుల్లో ఊరేగించారు. చాటింపు వేస్తూ ఎల్లల్లో పూజలు చేస్తూ అమ్మవారిని కొలిచారు. ఈనెల 13, 14 తేదీల్లో గంగజాతర జరుగుతుందని చాటింపు వేశారు. అలాగే సంతపేట జాతరకు కూడా చాటింపు వేసి అంకుర్పారణ చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఆ శాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పరీక్షలకు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు, కేంద్రాల్లో మౌలిక వసతులను పర్యవేక్షిస్తున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 29 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,095 మంది స్వామివారిని దర్శించుకోగా 26,912 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

సార్ చెబుతుంటే.. మేడమ్ వింటున్నారు..


చిత్తూరులో జరిగిన సదస్సులో ఎస్పీ, ఆయన సతీమణి హర్షిత

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో మంగళవారం జిల్లాలోని పోలీసు అధికారులకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్, డీఎన్ఏ ప్రొఫైలింగ్, సైబర్ ఫోరెన్సిక్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేరాలు కొత్త రూపాలు ఎలా దాలుస్తున్నాయి ? నిందితులను ఎలా పట్టుకోవాలి ? సాక్ష్యాల సేకరణపై ఎస్పీ మణికంత వివరించారు. నిపుణులను సైతం పిలిపించి సందేహాలను నివృత్తి చేయించారు. ఈ సదస్సులో ఎస్పీ వేదికపై కూర్చుని క్లాస్ చెబుతుంటే.. కింద కూర్చుని విషయాలను ఓ మహిళా అధికారి ఆసక్తిగా గమనిస్తున్నారు. ఆ అధికారిణి హర్షిత తిరుపతి రైల్వే (జీఆర్‌పీ) డీఎస్పీగా పనిచేస్తున్నారు. అయితే ఈమె ఎస్పీ సతీమణి కావడం గమనార్హం. ఇలా ఒకే వేదికలో ఎస్పీ దంపతులు వేర్వేరు హోదాల్లో సెమినార్‌కు హాజరుకావడం విశేషం.

ఎంపీడీఓలకు మండలాలు కేటాయింపు

చిత్తూరు కార్పొరేషన్: డిప్యూటీ ఎంపీడీఓల నుంచి ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి మండలాలను కేటాయించారు. ఈ వివరాలను మంగళవారం జెడ్పీ సీఈఓ రవి కుమార్‌నాయుడు తెలియజేశారు. ఎర్రావారి పాళెం డిప్యూటీ ఎంపీడీఓగా ఉన్న మాలతిని కేవీబీపురం ఎంపీడీఓగా నియమించారు. నాగలాపురంలో పనిచేస్తున్న వెంకటరత్నమ్మను బీఎన్‌కండ్రిగ ఎంపీడీఓగా, రామకుప్పంలో పనిచేస్తున్న రాధాకృష్ణకు గుడుపల్లె ఎంపీడీఓగా, వెదురుకుప్పంలో పనిచేస్తున్న పురుషోత్తానికి అక్కడే ఎంపీడీఓగా, అనకాపల్లిలో పనిచేస్తున్న శిరీషను గుడిపాల ఎంపీడీఓగా నియమించారు.

నా కుమార్తె ఆచూకీ కనిపెట్టండి బాబూ!

- సీఎం ముందు విలపించిన ఓ పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్

కుప్పంరూరల్: 'సార్ నా కుమార్తె 15 రోజుల క్రితం కనిపించకుండా పోయింది. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు ఆచూకీ తెలియరాలేదు. మీరైనా నా కుమార్తె కనిపెట్టి ఇవ్వండి. బాబు.' అంటూ కుప్పం మండలం గుడ్లనాయనపల్లి పంచాయతీ టీడీపీ ప్రెసిడెంట్ సీఎం చంద్రబాబు ముందు వాపోయినట్లు తెలిసింది. కళాశాలకంటూ ఇంటి నుంచి వెళ్లిన బాలిక ఇప్పటివరకు ఇంటికి రాలేదని, దీనిపై ఎవరు చర్యలు తీసుకోవడం లేదని చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. అక్కడితో ఆగకుండా మంగళవారం హోంమంత్రి అనితను సైతం కలిసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న నెటిజన్లు ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గంలో అధికార పార్టీ పంచాయతీ ప్రెసిడెంట్‌కే న్యాయం జరగక పోతే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందో అని అర్థమవుతుందని రకరకాల కామెంట్లు చేస్తున్నారు. మహిళల భద్రతే మా మొదటి ప్రాధాన్యత.. అన్ని రంగాల్లో మహిళలకే మొదటి ప్రాముఖ్యత అని చెప్పుకునే అధికార పార్టీ నాయకులు ఇప్పటికైనా ఆ బాలికను వెతికి పెట్టి ఆ తండ్రి, కుటుంబాన్ని శోకం నుంచి బయటికి తేవాలని జనం కోరుతున్నారు.

త్వరలో అంతరాలయ దర్శనం?

కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామి అంతరాలయ దర్శనానికి సేవ టికెట్ పెట్టాలనే ఆలోచనలో దేవదాయశాఖ ఉంది. స్వామివారి దర్శనార్థం ప్రతి రోజు వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ప్రస్తుతం ఆలయంలో ఉచితం, రూ.100, రూ.150 దర్శనాలు అమలులో ఉన్నాయి. అయితే వీరందరికీ స్వామివారిని మహామండపం నుంచి దర్శించుకునే అవకాశం మాత్రమే ఉంది. ఆలయ పునర్నిర్మాణం అనంతరం నూతనంగా అంతరాలయ దర్శనాన్ని ఆలయాధికారుల దేవాదాయ శాఖ అనుమతితో ఏర్పాటు చేశారు. అయితే అంతరాలయ దర్శనానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ పద్ధతి రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో అమలు అవుతోంది. ఈ విషయంపై దేవాదాయ శాఖ ఆలోచనలో పడింది. అంతరాలయ దర్శనానికి సేవా టికెట్ అమలు చేయాలని చూస్తోంది. అంతరాలయ దర్శనాన్ని ఓ సేవగా పరిగణిస్తే సేవకు ప్రత్యేక ధరను నిర్ణయించనుంది. దీంతో ఆలయ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అంతరాలయ దర్శనం టికెట్ అమలైతే ఇకపై ఎవరైనా టికెట్ కొనుగోలు చేసి స్వామివారిని దగ్గరగా చూడవచ్చు. త్వరలో వరసిద్ధుని ఆలయంలో అంతరాలయ దర్శనం సులభతరం కాబోతోంది.

పుంగనూరుకెందుకన్ని నిధులు?

- కూటమి ప్రజాప్రతినిధుల అక్కసు
- ఆ నియోజకవర్గానికి నిధులు తగ్గించాలని హుకుం
- కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం
- పాల్గొన్న ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


అధికారిక సమీక్షలో స్టేజీపై కూర్చుని ఉన్న హోదా లేని పుంగనూరు టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రజాప్రతినిధులు పుంగనూరు నియోజకవర్గంపై అక్కసు చూపించారు. ఆ నియోజకవర్గానికి ఎందుకు అన్ని నిధులు ఎక్కువ ఇచ్చారు.. ఇకపై ఆ నియోజకవర్గానికి తగ్గించండి అని టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అధికారులకు హుకుం జారీ చేశారు. ఉదయం 10.30 గంటలకు మొదలైన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం మధ్యాహ్నం 1.15 గంటలకే తూతూమంత్రంగా మమ అనిపించేశారు. ఈ సమీక్షలో 15 శాఖల్లోని అంశాలను చర్చించాల్సి ఉండగా.. 8 శాఖల్లో అంశాలపై తూతూమంత్రంగా చర్చించి చేతులు దులుపుకున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశంలో ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఎఫ్‌ఓ భరణి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

హైవేలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలి

జిల్లాలోని జగమర్ల–ఐతేపల్లి రోడ్డులో గత సంవత్సర కాలంలో ప్రమాదాలు జరిగి 600 మృతి చెందారని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. చిత్తూరు తిరుపతి బెంగళూరు హైవేల్లో నిత్యం ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పి.కొత్తకోటకు సమీపంలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు.

తాగునీటి సమస్యలకు అధిక నిధులు

జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో, పంచాయతీల్లో కేటాయించిన నిధులను అధికంగా తాగునీటి సమస్యల పరిష్కారానికి ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. జిల్లాలో మామిడి దిగుబడి అధికంగా ఉన్నందున పల్ప్‌ను టీటీడీ భక్తులకు అందజేసేలా ప్రజా ప్రతినిధుల సహకారంతో టీటీడీ ఆమోదం పొందితే మేలు జరుగుతుందన్నారు. జిల్లాలో ఈ నెల 4వ తేదీన కురిసిన వర్షానికి జరిగిన పంట నష్టం పరిహారం అందించేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

నిధులెందుకు మురగబెడుతున్నారు?

అసలే నిధుల సమస్యతో ఇబ్బందులు పడుతుంటే వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ నిధులున్నా ఎందుకు మురగపెడుతున్నారంటూ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు వైద్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక శాతం నిధులు ఖర్చు చేయకుండా అలాగే ఉంచితే తర్వాత నిధులు ఎలా వస్తాయంటూ చురకలంటించారు.

విచారణ చేసి నివేదికలివ్వండి

ఇటీవల ప్రభుత్వ, అపోలో ఆస్పత్రిలో జరిగిన ఓ మహిళ మృతి ఘటనపై సమీక్షలో చర్చించారు. అపోలో ఆస్పత్రిలోని వైద్యుల అలసత్వం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అపోలో ఎంటయూను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిబంధనల ప్రకారం అపోలో యాజమాన్యం మందులను కొనుగోలు చేస్తోందా..?లేదా.. పలు అంశాలపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలన్నారు.

అధికారిక సమావేశంలో స్టేజీపై టీడీపీ నేత

జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం అధికారికంగా కలెక్టరేట్‌లో చేపట్టగా ఈ సమావేశంలో టీడీపీ నేత స్టేజీ తిష్టవేశారు. ఎలాంటి హోదా లేని పుంగనూరు టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డి దర్జాగా స్టేజీపై కూర్చోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అధికారిక సమావేశంలో హోదా లేని ఆ టీడీపీ నేత ఎలా పాల్గొంటారని, గతంలో సైతం అనేక సమావేశాల్లో ఇలానే పాల్గొన్నాడని అధికారులు గుసగుసలాడారు. అదే విధంగా జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశంలో టీడీపీ నేతలు పాల్గొని సమావేశానికి ఇబ్బంది కలిగేలా చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.

గగనంగా మామిడికి గిట్టుబాటు

జిల్లాలో ఎక్కువ మంది మామిడి రైతులున్నారని, అయితే ప్రతిసారీ మామిడికి గిట్టుబాటు ధర కల్పించడం గగనమవుతోందని ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర, ఎగుమతులు, టీటీడీతో ఒప్పందం వంటి అంశాలను సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయని, జిల్లాలో ఉన్నతాధికారులకు ఉన్న చిత్తశుద్ధి క్షేత్రస్థాయిలో రెవెన్యూ ఉద్యోగులకు లేదని మండిపడ్డారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తే ఈరోజుకీ ప్రజలు కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. తప్పెవరిదని రెవెన్యూ ఉద్యోగులు గుండెపై చేయి వేసుకుని పరీక్షించుకోవాలన్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగండి

చిత్తూరు కలెక్టరేట్: విభిన్న ప్రతిభావంతులు మనోధైర్యంతో ముందుకు సాగాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న 18 మంది విభిన్నప్రతిభావంతులకు ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఒక్కొక్కటి రూ.6.30 విలువ చేసే బ్యాటరీ సైకిళ్ల పంపిణీ చేశామన్నారు. విభిన్నప్రతిభావంతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళిమోహన్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కట్టమంచి చెరువు పూడికతీత

నగరంలోని కట్టమంచి చెరువులో చేస్తున్న పూడిక తీత పనులను పకడ్బందీగా చేయాలని ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన కట్టమంచి చెరువులో పనుల పురోగతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కట్టమంచి చెరువులో పూడిక తీత, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం మొదలుకాక ముందే పూడిక తీత పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం గాంధీరోడ్డులో రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టాలని నగరకమిషనర్ నరసింహప్రసాద్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, నగర మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, పలువురు అధికారులు పాల్గొన్నారు.


పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఇంచార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో పదిమంది అరెస్టు

పలమనేరు: పట్టణంలో గత నెల 25వ తేదీన సునీల్‌కుమార్ అనే యువకుడిపై జరిగిన హత్యాయత్నం కేసులో పదిమంది నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ నరసింహరాజు మంగళవారం తెలిపారు. అరెస్టయిన వారిలో కళ్యాణ్‌కుమార్, పవన్, సాయి, హరితో పాటు మరో ఆరుగురున్నారని తెలిపారు. ఇదే కేసులో మరో ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. జాతర సందర్భంగా రౌడీయిజం చేసిన వారిని వదిలి పెట్టే ప్రసక్తేలేదన్నారు. జాతరకు సంబంధించి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పాత కేసుల్లోని వారిని కూడా బైండోవర్లు చేసుకుంటున్నామని తెలిపారు.

తంబిగానిపల్లిలో చోరీ


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలోని తంబిగానిపల్లిలో కాపురమున్న బాబు ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి 10 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లినట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు.. బాబు తన పెంకుటింట్లో నిద్రిస్తుండగా పక్కనే ఉన్న గది తలుపు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బీరువాలో ఉంచిన 10 గ్రాముల బంగారు ఆభరణం, 250 గ్రాముల వెండి ఆభరణాలతోపాటు రూ.4వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కుప్పం పోలీసులు తెలిపారు.

జామీనుదారులకు జైలు

ఐరాల: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితులకు జామీను ఇచ్చిన పీలేరుకు చెందిన నాగరాజు, తండ్రి సిద్ధయ్యకు ఆరు నెలలు జైలుశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగళవారం ఎస్ఐ నరసింహులు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ జామీనుదారులను కోర్టులో హాజరు పరచకుండా ఉన్నందుకు జడ్జి శిక్ష విధించినట్లు వెల్లడించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి


మణి మృతదేహం

పుంగనూరు: తన సొంత ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటుండగా విద్యుత్‌షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రాంపల్లెలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. రాంపల్లెకు చెందిన గోవిందప్ప కుమారుడు మణి(32) ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం 10 గంటల సమయంలో ఇంటి కట్టడాలకు నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఇంటి పై నుంచి నీటి సంపులో పడిపోయాడు. దీనిని గమనించిన స్థానికులు మణిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

జాతర మొదలైందహో!

'ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా.. చాటింపుతో నేటి నుంచి తిరుపతి గంగజాతర ప్రారంభమైంది.. వారం రోజుల పాటు తిరుపతిలో గంగజాతర కొనసాగుతుంది.. గనుక నగరవాసులెవ్వరూ ఊరువదలి వెళ్లరాదు.. ఇంతర ప్రాంతాల నుంచి వచ్చేవారు రాత్రి పూట ఇక్కడ బస చేయరాదు. అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహించుకోవాలహో...' అంటూ కైకాల వంశస్థలు తిరుపతి గంగజాతర చాటింపును వేశారు.

- అర్ధరాత్రి నగర పొలిమేరల్లో కైకాల చాటింపు
- అమ్మవారి కొడిస్తంభానికి అభిషేకం, ఒడిబాల సమర్పణ
- ప్రత్యేక అలంకరణలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మతల్లి దర్శనం


చప్పరాల ఊరేగింపు




తాతయ్యగుంట గంగమ్మ గుడికి పుట్టింటి సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న అవిలాల వాసులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో జాతర సందడి నెలకొంది. గ్రామదేవత తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద కోలాహలం ఏర్పడింది. భేరీవీధిలో తొలి చాటింపు పూజ నిర్వహించారు. అనంతరం నాటి నగర శివారు ప్రాంతాలైన నాలుగు కాళ్ల మండపం, హెడ్ పోస్టాఫీస్, కృష్ణాపురం ఠాణా, పాత మెటర్నటీ ఆస్పత్రి సర్కిల్ ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి డప్పు కొట్టి అష్టదిగ్బంధన చేసి చాటింపు చేశారు. ఆ చాటింపుతో తిరుపతి శ్రీతాతయ్యగుంట చిన్నగంగమ్మ (తిరుపతి గ్రామదేవత) జాతర అత్యంత వేడుకగా ఆరంభమైంది.

ఒడిబాల సమర్పణ

భక్తకోటి కోర్కెలు తీర్చే కల్పవల్లి, తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగ జాతర బుధవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనుంది. జాతర సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి విశ్వరూప కొడిస్తంభానికి అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు చేసి ఒడిబాల సమర్పించారు. అమ్మవారు వజ్రకిరీటం, బంగారు ముఖ కవచం ధరించి భక్తులను అనుగ్రహించారు. పలువురు భక్తులు వెయ్యి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పసుపు, కుంకుమ తీసుకొచ్చి కొడిస్తంభం వద్ద పూజలకు సమర్పించారు. ఆలయ ఈవో ఏ.జయకుమార్, అర్చకులు రామకృష్ణశర్మ, మురళీస్వామి పాల్గొన్నారు.


అమ్మవారి సారె తెస్తున్న ఎమ్మెల్యే ఆరణి

ఆరోగ్యానికి పుండు

పండు ఆరోగ్యదాయకం..రోజూ ఓ పండు తింటే మంచిదని వైద్యులు చెప్పే మాట. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో విక్రయిస్తున్న పండ్లు తింటే ఆరోగ్యం పుండవక మానదు. వీటి మాటున విషయం దాగి ఉంది. పక్వానికి రాని, గాలీవానలకు రాలిన కాయలను విషపూరిత రసాయనాలతో మాగబెడుతుండడంతో వాటిని తిన్న వారు అనారోగ్యం బారిన పడాల్సి వస్తోంది.

- ఫలాలపై రసాయన పంజా
- కార్బైడ్ వినియోగంతో విషపూరితం


మామిడిపై చల్లుతున్న విషపూరితమైన రసాయనాలు(ఫైల్)


రసాయనాలు చల్లిన 24 గంటలకే రంగు మారిన అరటి పండ్లు, మామిడి, ప్రమాదకరమైన కార్బైట్ గుళికలు

పలమనేరు: ఆరోగ్యం కోసం పండ్లు తింటుంటే వాటి మాటున విషం పొంచి ఉంటుంది. మార్కెట్‌ల్లో ప్రస్తుతం పలు రకాల పండు సరసమైన ధరల్లో లభిస్తుండడంతో కొనడానికి, తినడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చే వారు మాత్రం ఆలోచిస్తున్నారు. పలు రకాల కాయలను మాగబెట్టడానికి విచ్చల విడిగా రసాయనాలు వాడుతుండడమే ఇందుకు కారణం.

కనిపించని సహజపద్ధతులు

గతంలో కాయలు మాగబెట్టేందుకు సహజసిద్ధంగా ఊదర ప్రక్రియ, బోద కసువులో పెట్టి మాగబెట్టే పద్ధతులు ఇప్పుడు కనిపించడం లేదు. జిల్లాలోని పలు పట్టణాల్లో నిర్ణీత రుసుం చెల్లిస్తే పచ్చి కాయలను రసాయనాలతో మాగబెట్టే గోడౌన్‌లున్నాయి. గోడౌన్‌కు తరలించిన పచ్చి కాయలు 24 గంటల్లోపు పండ్లుగా మారుతున్నాయి.

ప్రమాదకర రసాయనాలతో...

గోడౌన్‌కు తరలించిన అరటి, మామిడి కాయలను మొదట మ్యాంకోజబ్-45 అనే పౌడర్‌ను ఒక లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున వేస్తారు. ఆ నీటిలో ఈ పచ్చి కాయలను ముంచి పక్కన బెడతారు. తర్వాత ఎథిలిన్, కాల్షియం కార్బైడ్ తదితర బిళ్లలు, రసాయనాలను నీటిలో వేస్తే దాని నుంచి గ్యాస్ ఫామ్ అవుతుంది. ఓ గదిలో కాయలను ఉంచి ఈ గ్యాస్‌ను వదిలి ఆ గదిలోకి గాలిపోకుండా చేస్తారు. మరోవైపు వేపర్ ట్రీట్‌మెంట్ పేరిట కాయలను బందీ చేసిన గదుల్లోకి విషపూరితమైన మిథైల్ గ్యాస్‌ను వదిలి పెడతారు. దీంతో 24 గంటల్లోకి పచ్చి కాయలకు సైతం మంచి రంగు వచ్చి పండ్లుగా మారుతున్నాయి. మరికొంత మంది ఇంజెక్షన్‌ల ద్వారా కాయల్లోకి రసాయనాలు పంపి, మాగబెడుతున్నారు.

కాల్షియం కార్బైడ్ అమ్మకాలపై నిషేధమున్నా...

జిల్లాలో 8 వేల వరకు పండ్ల దుకాణాలున్నాయి. అలాగే 80 వరకు రీపినింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో విషపూరితమైన రసాయనాలతో మాగబెట్టిన పండ్లను దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయిస్తున్నా వీరిపై చర్యలు లేవు. పట్టించుకునేవారే కరువయ్యారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఆహార కల్తీ నిరోధక శాఖ ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వారు అసలు పట్టించుకోవడం లేదు.

కార్బైడ్‌తో మాగబెడితే చర్యలు తప్పవు



మామిడి కాయలను రసాయనాల ద్వారా మాగబెట్టడంపై నిషేధం ఉంది. కార్బైడ్‌ను వినియోగించినట్టు తనిఖీల్లో తేలితే మూడేళ్ల జైలుశిక్షతోపాటు జరిమానా తప్పదు. సహజపద్ధతిలోనే మామిడిని మాగించాలి. మామిడిని మాగబెట్టే సెంటర్లను ఇప్పటికే మార్కెటింగ్, హార్టికల్చర్, సచివాలయ సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. అవసరమైతే మామిడి మార్కెట్‌లో పండ్లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా రసాయనాలపై టెస్టులు చేయిస్తాం.

– విద్యాధరి, జేసీ, చిత్తూరు

రోగాలను కొని తెచ్చుకున్నట్టే...



పండు రంగు చూసి ఆశపడి కొని తింటే రోగాన్ని తెచ్చుకున్నట్టే. రసాయనాలతో మాగబెట్టిన పండ్ల తినడంతో అది విడుదల చేసే ఆర్సెనిక్ యాసిడ్ కారణంగా కాలేయం, మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు రావచ్చు. సీజన్‌లో దొరికే సహజసిద్ధంగా మాగబెట్టిన పండ్లను తినడం మేలు.

– మమతారాణి, ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్, పలమనేరు

మోతాదుకు మించి రసాయనాల వాడకం



ఏ పంటను పండించినా అవసరమైన మోతాదులోనే రసాయనిక మందులను పిచికారీ చేయాలి. అయితే రైతులకు దీనిపై అవగాహన లేక పంట బాగా రావాలని అనవరసంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో ప్రకృతి పాడవడంతోపాటు మనిషికి లేనిపోని రోగాలు వస్తున్నాయి. అందుకే సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం.

–మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయఅధికారి, చిత్తూరు

కుట్టుమిషన్ల పేరిట బీసీలకు కుచ్చుటోపీ

- వైఎస్సార్‌సీపీ విశ్వబ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పవిత్ర


ఎస్ఎం పవిత్ర

పలమనేరు: కుట్టు మిషన్ల పేరుతో బీసీలకు కూటమి ప్రభుత్వం కుచ్చుటోపీ పెట్టిందని వైఎస్సార్ సీపీ విశ్వబ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ఎం పవిత్ర తెలిపారు. పలమనేరులో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ బీసీ మహిళలకు చేయూత ద్వారా అందజేసే కుట్టుమిషన్లు సక్రమంగా అందించలేదన్నారు. కేవలం ఇందులో కమీషన్ల కోసం నాసిరకమైనవాటిని ఎంపిక చేశారని విమర్శించారు. మరోవైపు లబ్ధిదారులను పెంచి, తద్వారా కూటమి ప్రభుత్వం రూ.245 కోట్లను దోచుకుంటోందని ఆరోపించారు. ఓ కుట్టుమిషన్ ధర రూ.4,300, టైలరింగ్ శిక్షణకు రూ.3 వేలు మొత్తం కలిపి రూ.7,300 అవుతుందని, రాష్ట్రంలో లక్షమంది లబ్ధిదారులకు రూ.73 కోట్లు అవుతుందన్నారు. అయితే ప్రభుత్వం ఇందుకు రూ.245 కోట్లు చూపడం కూటమి అక్రమాలకు నిలువెత్తు సాక్ష్యమని విమర్శించారు. ఇదంతా చూస్తుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ప్రజల బాగు కోసం కాదని, కేవలం నేతల జేబులు నింపుకోవడానికే మాట చెప్పాల్సివస్తోందన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్, సర్వేయింగ్ కోర్సులకు ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతి, యువకులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు పదో తరగతి, ఆపై కోర్సులు చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసే అభ్యర్థులకు ఏపీఎస్ఎస్‌డీ సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9704762155, 7396631623 నంబర్లలో సంప్రదించాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఉన్న స్కిల్ హబ్ కేంద్రంలో ఈ నెల 9 వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

ఐదు కేంద్రాల్లో నేడు ఐసెట్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లావ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాలలో ఐసెట్-2025 బుధవారం నిర్వహించనున్నారు. జిల్లాలో గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు ఎస్వీ పెరుమాళ్ ఇంజనీరింగ్, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, తిరుపతి జూపార్క్ సమీపంలోని ఐయాన్ డిజిటల్ సెంటర్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పరీక్షకు తిరుపతి జిల్లాలో సుమారు 5వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు 300 మంది గైర్హాజరు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షకు 300 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 911 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 611 మంది మాత్రమే వచ్చారని తెలియజేశారు. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులకు తాగు నీటితోపాటు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.

ఉరుములు.. మెరుపులతో వర్షం

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజవర్గంలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులు వీచాయి. అర్ధగంట పాటు కురిసిన వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. చాలా చోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వాచ్‌మన్ మృతి


మృతి చెందిన మునిశేఖర్ (ఫైల్)

తిరుపతి రూరల్: పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారికి అనుకుని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గార్డెన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి సోమవారం అర్ధరాత్రి కాలుజారి కింద పడడంతో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. రేణిగుంట మండలం, అన్నసామిపల్లికి చెందిన మునిశేఖర్ (32) 2020 నుంచి గార్డెన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ 6వ అంతస్తులోని పెంట్ హౌస్‌లో నివాసముంటున్నాడు. మునిశేఖర్ భార్య రోజావతి అక్కడే స్వీపర్‌గా పనిచేస్తుండగా.. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మునిశేఖర్ మద్యం మత్తులో 6వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. ఆ వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు చికిత్స నిమిత్తం అతన్ని రుయా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

అద్దెల మద్దెల



ప్రస్తుత పరిస్థితిలో అద్దె ఇల్లు అనేది సామాజిక అవసరం. అద్దెదారులు బాధ్యతగా అద్దె చెల్లించాలి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రస్తుత కూటమి సర్కారు దెబ్బకు ఇళ్ల యజమానులు ఇష్టారీతిన అద్దెలు పెంచేస్తున్నారు. ఏమిటని టెండెంట్లు అడిగితే ఇంటిపన్ను, కొళాయి పన్నులు పెరిగాయని సమాధానం. ఫలితం ఇళ్ల అద్దెలు రెట్టింపు అయ్యాయి. ఫలితంగా అద్దెదారులకు అద్దెల మద్దెల మోగుతోంది. సగం సంపాదన ఇంటి అద్దెకే సరిపోతోంది.

- సగం సంపాదన ఇంటి అద్దెకే!
- పట్టణాల్లోనే కాదు పల్లెల్లోనూ పెరిగిన ఇంటి అద్దెలు
- ఏడాదిలో భారీగా అద్దె పెంచిన యజమానులు
- మరింత భారంగా కరెంట్ చార్జీలు
- ఇబ్బందుల్లో సామాన్యుల బతుకుబండి

పలమనేరు: పట్టణ సమీపంలోని సాయినగర్‌కు చెందిన జ్యోతి కుటుంబం ఓ అద్దె ఇంట్లో కాపురముంటోంది. ఆమె ఓ గార్మెంట్స్‌లో పనిచేస్తూ నెల జీతం రూ.10 వేలతో తన కుటుంబాన్ని పోషిస్తోంది. ఇందులో ఇంటి అద్దెకు రూ.6 వేలు, విద్యుత్ బిల్లుకు రూ.550 మొత్తం కలిపి రూ.6,550 అవుతోంది. మిగిలిన సగం సంపాదనలో పిల్లల చదువులు, ఇంటి సామగ్రి, ఆస్పత్రి ఖర్చులు తదితరాలకు సైతం ప్రతి నెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి. దీంతో ఇంటి యజమాని అద్దె పెంచినప్పుడల్లా ఆ ఇల్లు ఖాళీ చేసి తక్కువ అద్దె ఉన్న మరో ఇంటికి వెళ్లడం ఆమెకు పరిపాటిగా మారింది. ఇది కేవలం పలమనేరు ప్రాంతంలోనే కాదు జిల్లాలో అద్దె ఇంటిదారుల పరిస్థితి. అద్దెల భారం పట్టణాలు, నగరాల్లో అయితే మరీ ఎక్కువైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు కొండెక్కాయి. సూపర్‌సిక్స్ మాయమైంది. దీంతో పేదల బతుకులు భారంగా మారాయి. ఇక పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ఇంటి పన్ను, నీటి పన్నులు పెంచేశారు. దీంతో అద్దె పెంచాల్సి వచ్చిందని ఇంటి యజమానులు చెబుతున్నారు.

భారీగా పెరిగిన ఇంటి అద్దెలు

గత రెండేళ్లకు ఇప్పటికీ ఇంటి అద్దెలు రెట్టింపు అయ్యాయి. చిత్తూరు, పలమనేరు, కుప్పం లాంటి చోట్ల ఇంటి అద్దె రూ.4 వేలు నుంచి రూ.8 వేలు వరకు ఉంది. పుంగనూరు, నగిరి, పుత్తూరులో రూ.6 వేలుగా ఉంది. ఇక మండల కేంద్రాల్లో రూ.3 నుంచి రూ.4 వేలుగా ఉంది. గతంలో పెద్దనోట్ల రద్దుతో అద్దెల భారం ఎక్కువైంది. అప్పటి నుంచి ఇంటి యజమానులు ఏటా అద్దెను కొంత పెంచుతూ వచ్చారు. దీనికి తోడు అన్ని వస్తువులపై జీఎస్టీ రావడంతో అధికభారం పడింది. పంచాయతీల్లో మొదలు, మున్సిపాలిటీలో ఇంటి, నీటి పన్నులు పెంచేశారు. దీంతో ఇంటి యజమానులు ఈ దఫా ఎక్కువగా అద్దెలు పెంచేశారు.

అద్దె ఇళ్లలో మరెన్నో సమస్యలు

అద్దె ఇంట్లో ఏదేని శుభకార్యమైతే పర్వాలేదు కానీ అశుభ కార్యమైతే ఇంటి యజమానులు ఒప్పుకోవడం లేదు. ఇలాంటి సమయాల్లో అంత్యక్రియలు సొంత ఊర్లలో చేసుకోవాల్సి వస్తోంది. ఇన్ని సమస్యల మధ్య అలవాటు పడిన చోటును వదులుకోలేక పెంచిన అద్దెలు కష్టమైనా చెల్లిస్తున్నారు. కాదు కూడదు అంటే వెంటనే ఇంటిని ఖాళీ చేయాల్సిందే. వెంటనే మరో అద్దె ఇల్లు దొరుకుందా? అంటే అదీ సమస్యే. దీంతో అద్దె ఇళ్లలో కాపురాలుండేవారు తమ బాధలను ఎవరికీ చెప్పుకోవాలో అర్థంగాక కుమిలిపోతున్నారు.

అద్దెల నియంత్రణకు చట్టాలూ కరువే

వ్యవస్థాగతంగా అద్దెల నియంత్రణకు చట్టాలు, నిబంధనలు లేకపోవడం ఇంటి యజమానులకు వరంలా మారింది. దీంతో వారు ఇష్టానుసారంగా ఏటా అద్దెలు పెంచుతున్నా.. వీరిని ప్రశ్నించేవారే లేరు. గతంలో పదేళ్లకు, ఐదేళ్లకు, మూడేళ్లకు అద్దె ఇంట్లో ఉండేలా యజమానులు అగ్రిమెంట్లు రాసిచ్చేవారు. ప్రస్తుతం ఏడాదికి మాత్రమే అగ్రిమెంట్లను రాసిస్తున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలో మొత్తం జనాభా	18.72 లక్షలు (2011 జనాభా లెక్కల మేరకు)
ప్రస్తుత జనాభా	సుమారు 23 లక్షల దాకా
అసెంబ్లీ నియోజకవర్గాలు	6
మండలాలు	32
మున్సిపాలిటీలు 4,	కార్పొరేషన్ 1
జిల్లాలోని ఇళ్లు	6,39,953
అద్దె ఇళ్లు	సుమారు 80వేలు

చట్టాలు రావాలి



నేను గతంలో అమెరికా వెళ్లి వచ్చా. అక్కడ మా పిల్లలున్నారు. అక్కడి ప్రభుత్వం ఇంట్లోని సౌకర్యాలు, విస్తీర్ణం తదితరాలను సర్వే చేసి, అద్దె నిర్ణయిస్తుంది. యజమాని ఇష్టానుసారంగా అద్దెలు పెంచడం జరగదు. అలాంటి చట్టాన్ని ఇక్కడ అమలు చేస్తే అద్దెల భారం తగ్గుతుంది. ముఖ్యంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో దీన్ని అమలు చేస్తే బాగుంటుంది.

– గురురాజారావు, రిటైర్డ్ టీచర్, పలమనేరు

నెలొస్తే ఇంటి అద్దెతో భయమేస్తుంది



నేను మూడేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నా. గతంలో రూ.2,500 ఉన్న అద్దె ఇప్పుడు రూ.6 వేలు అయ్యింది. నెలకు రూ.350 వస్తున్న కరెంట్ బిల్లు ఇప్పుడు రూ.550 వరకు వస్తోంది. అద్దె ఇలా పెంచుతూపోతే ఎలా అని ఓనర్‌ను అడిగితే గతంలో ఉన్న ఇంటిపన్ను ఇప్పుడు డబులైంది. మీకు ఇష్టం ఉంటే ఉండండి లేదా వేరే ఇల్లు చూసుకోమని చెబుతున్నాడు ఇంటి ఓనర్. నాకొచ్చే సంపాదనలో సగం ఇంటి అద్దెకు పోతే ఎలా కుటుంబాన్ని పోషించాలో ఏమో.

– జ్యోతి, పలమనేరు